సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 29 । జూన్ । 2025



అధికారులూ.. ఇదేం పద్ధతి

ప్రొటోకాల్ ఉల్లంఘనపై జెడ్పీ చైర్ పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్‌ను అవమానించడం సరికాదన్నారు.

- 8లో



సిఫార్సులకే పెద్దపేట

సచివాలయ బదిలీల్లో సిఫార్సులకే పెద్దపీట వేస్తున్నారు. సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

- 8లో

కేజీబీవీ సిబ్బందికి కౌన్సెలింగ్

శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లా సమగ్ర శిక్షా పరిధిలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు(కేజీబీవీ)లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి రీప్లేస్‌మెంట్, రీ పోస్టింగ్‌ను చేపడుతున్నట్లు సమగ్ర శిక్షా ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.శశి భూషణ్ శనివారం తెలిపారు. ఈ నెల 30వ తేదీ ఉదయం 9 గంటలకు పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.

నోట్ దిస్ ఫ్రాడ్



- నోట్ల మార్పిడి నిందితుడికి టీడీపీతో లింకులు
- రూ. 500 నోట్లు ఇస్తే అంతకు రెట్టింపుగా రూ. 2వేలు నోట్లు ఇస్తానని మోసం
- తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో మోసం చేసి దొరికిన కాశీబుగ్గకు చెందిన అంబటి సంతోష్
- మంత్రి అచ్చెన్నాయుడుతో తీసుకున్న ఫొటోను ప్రొఫైల్ పిక్‌గా పెట్టుకున్న సంతోష్
- కేసు నుంచి తప్పించుకునేందుకు టెక్కలిలో కీలక నేతను సంప్రదించిన బంధువులు
- పరువు పోతుందని జోక్యం చేసుకోని నేత



రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో నోట్ల మార్పిడి మోసం ప్రధాన నిందితుడు అంబటి సంతోష్ ఉన్న చిత్రమిది. సంతోష్ ఫేస్‌బుక్‌లో ఈ చిత్రాన్నే ప్రొఫైల్‌గా పెట్టుకున్నారు. ఈయనే కాదు వారి కుటుంబ సభ్యులు కూడా టీడీపీ నాయకులతో ఉన్న ఫొటోలున్నాయి. టీడీపీ జెండా ఆవిష్కరించిన చిత్రాలు కూడా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

మన దగ్గర ఎక్కడా రూ.2వేల నోట్లు చెలామణిలో లేవు. ఎవరి దగ్గరైనా ఆ నోట్లు ఉంటే, తగు ఆధారాలు చూపించి రిజర్వ్ బ్యాంకులో మార్చుకోవచ్చు. ఈ వెసులుబాటును వాడుకుని తిరుపతి జిల్లా సూళ్లూరు పేటలో ఒక వ్యక్తి మోసానికి పాల్పడ్డాడు. తమకు కోటి విలువైన రూ.500నోట్లు ఇస్తే, రూ.2.5కోట్లు విలువైన రూ.2వేల నోట్లు ఇస్తానని ఒకరిని నమ్మించాడు. డబ్బుకు ఆశ పడిన ఓ వ్యక్తి డీల్ ప్రకారం రూ.500నోట్లతో రూ.కోటి ఇచ్చేశాడు. డబ్బు తీసుకున్నాక రూ.2.5కోట్ల విలువైన రూ.2వేల నోట్లు ఇవ్వకుండా టోపీ పెట్టాడు. వెంటనే అప్రమత్తమైన బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో మధ్యవర్తికి ఇచ్చిన సొమ్మును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

తిరుపతి జిల్లాలో జరిగిన ఈ సంఘటనకు జిల్లాతో లింకులున్నాయి. ఆ మోసం చేసింది మన జిల్లాకు చెందిన కాశీబుగ్గ వాసి. అందునా టీడీపీకి చెందిన వ్యక్తి. పేరు అంబటి సంతోష్. అతని కుటుంబమంతా టీడీపీలోనే ఉంది. అటు కాశీబుగ్గలో, టెక్కలి నియోజకవర్గ పరిధిలో కుటుంబ సభ్యులు ఉన్నారు. ఆయన కోసం, తనతో ఫోన్ కాంటాక్ట్‌లో ఉన్న వారి కోసం సూళ్లూరు పేట పోలీసులు ఇటీవల కాశీబుగ్గ, టెక్కలి వచ్చారు. విషయం ముందుగానే తెలియడంతో దొరకకుండా జాగ్రత్త పడ్డారు.



మంత్రి అచ్చెన్నాయుడితో ఉన్న ఫొటోను ప్రొఫైల్ పిక్‌గా పెట్టుకున్న అంబటి సంతోష్

కానీ, అంబటి సంతోష్ మాత్రం చివరికి పోలీసులకు వేరే చోట పట్టుబడ్డారు.

నోట్ల మార్పిడి మోసంలో నిందితుడైన అంబటి సంతోష్ కోసం సూళ్లూరు పేట పోలీసులు విచారణ చేస్తుండగా ఆయన కాల్ లిస్టులో వరసకు బంధువులైన టెక్కలికి చెందిన అధికార పార్టీ చోటా నాయకులు, మరికొంతమంది నంబర్లు ఉండటంతో టెక్కలిలో సదరు పోలీసులు ఆరా తీశారు. ఎప్పుడైతే పోలీసుల రాకను తెలుసుకున్నారో వెంటనే ఆ పార్టీకి చెందిన కీలక నేత వద్దకు వెళ్లారు. కాపాడాలని ప్రాధేయ పడినట్టు తెలిసింది. కాకపోతే, ఆ నేత ససేమిరా అనేశారు. ఇప్పుడీ విషయంలో జోక్యం చేసుకుంటే పరువు పోతుందని, తనకు మచ్చగా మారుతుందని భయపడి కాస్త తిట్టి పంపించేశారు. దీంతో చేసేదేమీలేక సైలెంట్‌గా ఉండిపోయారు.

పాత నేరస్తుడే..

సూళ్లూరుపేటలో నోట్లు మార్పిడి మోసంలో ప్రధాన నిందితుడైన అంబటి సంతోష్‌కు నేరాలు కొత్తేమీ కాదు. ఆయనపై ఇప్పటికే ఐదు కేసులు నమోదై ఉన్నాయి. కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో రౌడీ షీట్ కూడా ఉంది. సూళ్లూరుపేటలో మోసం చేసినట్టుగానే 2023లో జిల్లాలో కూడా మోసం చేశారు. రూ.500నోట్ల కట్టలు అందిస్తే అంతకు పది శాతం కలిపి రూ. 2వేలు నోట్ల కట్టలు అందిస్తామని మాయమాటలు చెప్పి నరసన్నపేటకు చెందిన ఒకరిన్ని మోసం చేశారు. దానిపై కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. అదే తరహాలో సూళ్లూరుపేటలో మోసం చేసి పట్టుబడ్డారు. ఈయనపైనే కాదు ఆయన బంధువులపై కూడా రౌడీషీట్‌లు ఉన్నాయి.

జూలై 3న వైఎస్సార్ సీపీ సమావేశం



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: జిల్లా కేంద్రంలో జూలై మూడున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త కురసాల కన్నబాబు, జిల్లా పరిశీలకులు కుంభా రవిబాబు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. చంద్రబాబు హామీలను ప్రజలందరికీ గుర్తు చేసే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్తంగా 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం జరగనుందని, దీనిపై ఆలోచనలు, కార్యాచరణ ఖరారు చేసేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

తెలుగు వారి ధైర్యసాహసాలకు ప్రతీక రామ్‌గోపాల్ నాయుడు



మేజర్ రామ్‌గోపాల్‌నాయుడును సన్మానిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని, మాజీ డిప్యూటీ సీఎం కృష్ణదాస్, ఇన్‌చార్జి తిలక్, నాయకులు వాణి తదితరులు

టెక్కలి:

తెలుగు వారి ధైర్య సాహసాలకు ప్రతీకగా రామ్‌గోపాల్‌నాయుడు నిలిచారని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ కొనియాడారు. శనివారం సంతబొమ్మాళి మండలం నగిరిపెంట గ్రామంలో మేజర్ రామ్‌గోపాల్‌నాయుడును అభినందించి జ్ఞాపికను అందజేశారు. దేశరక్షణలో భాగంగా జమ్మూ కశ్మీర్ నియంత్రణ రేఖ వద్ద శత్రువులను మట్టుబెట్టి తన తోటి సైనికులను రక్షించడంలో రామ్‌గోపాల్‌నాయుడు చూపిన ధైర్య సాహసాలు నేటి యువతకు ఆదర్శమని గుర్తు చేశారు. దేశంలో అత్యున్నత పురస్కారం అందుకున్న తొలి తెలుగు వ్యక్తిగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన రామ్‌గోపాల్‌నాయుడు చరిత్ర సృష్టించారని కొనియాడారు. రామ్‌గోపాల్‌నాయుడును సన్మానించిన వారిలో వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, కళింగ సామాజిక వర్గం రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, సంతబొమ్మాళి, టెక్కలి, కోటబొమ్మాళి జెడ్పీటీసీలు పాలవసంత్‌రెడ్డి, దువ్వాడ వాణి, దుబ్బ వెంకటరావు, నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణా నిలుపుదల



దూసి రోడ్డులో అక్రమ ఇసుక లారీలు నిలిచిపోవటంతో నిర్మానుష్యంగా కనిపిస్తున్న రహదారి

సాక్షి ఎఫెక్ట్...

ఆమదాలవలస రూరల్: ఇసుక అక్రమ రవాణాపై 'సాక్షి' వరుస కథనాలకు అధికారులు స్పందించారు. ఆమదాలవలస రూరల్ మండలం కొత్తవలస ఇసుక ర్యాంపు నుంచి ఇసుక లారీలు శనివారం పూర్తిగా నిలుపుదల చేశారు. అంతే కాకుండా దూసి రోడ్డు పొడవునా లారీల రాకపోకలు నిలిచిపోవటంతో రహదారి నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. కొత్తవలస గ్రామంలో విద్యుత్ తీగలను తాకేవిధంగా ఇసుక నిల్వ వేయటంతో ఇసుక ర్యాంపుల యజమానులకు విద్యుత్ శాఖాధికారులు హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. దారులన్నీ గోతులమయం కావడంతో దూసిపేట గ్రామానికి చెందిన ప్రజలు లారీలు కొంత సమయం నిలుపుదల చేయటమే కాకుండా జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించడంతో లారీలు పూర్తిగా నిలిచిపోయాయి.

న్యూస్‌రీల్

మత్స్యావతారుడై..



మొండేటివీధిలో మత్స్యావతారంలో జగన్నాథుడు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం మొండేటివీధి షిర్డీ సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న రథయాత్ర ఉత్సవాల్లో స్వామిని శనివారం మత్స్యావతారంలో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

ఖండాలు దాటి.. కన్నవారింటికి



తేలుకుంచిలో సందడి చేస్తున్న సైబీరియా పక్షులు

ఇచ్ఛాపురం రూరల్: సైబీరియా నుంచి విదేశీ విహంగాలు తేలుకుంచికి చేరుకుంటున్నాయి. వీటి శాస్త్రీయ నామం 'అనస్థోమస్'. పక్షులు గ్రామంలోని ఊర చెరువు, గ్రామ దేవత ఆలయం వద్ద కంచి చెట్లపై గూళ్లు ఏర్పాటు చేసుకొని ఇక్కడే గుడ్లు పొదుగుతాయి. ఏటా జూన్ నెలాఖరులో వచ్చి తమ గ్రామంలో గుడ్లు పొదిగి, పిల్లలను సంరక్షించుకునే ఈ పక్షులను గ్రామస్తులు తమ పుట్టింటి ఆడబిడ్డగా పరిగణిస్తారు. పక్షులకు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా గ్రామస్తులు కాపాడుకుంటారు.

నవ్విపోదురు గాక..

- ఉద్దానం తాగునీటి పథకం రెండోదశ పనులకు రెండోసారి శంకుస్థాపన
- గత ఏడాదే ఈ పనులకు శ్రీకారం చుట్టిన అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- మళ్లీ ఆ పనులకే శంకుస్థాపన చేయడంపై విమర్శలు

పాతపట్నం/హిరమండలం:

వైఎస్సార్ సుజల ధార ఉద్దానం ప్రాజెక్ట్.. వైఎస్ జగన్ ప్రభుత్వం రూపకల్పన చేసి, నిధులు విడుదల చేసి, పనులు పూర్తి చేసిన ప్రాజెక్టు. దశాబ్దాల తరబడి జిల్లాను పాలిస్తున్న వారు కలలో సైతం ఊహించని రీతిలో వైఎస్సార్ సీపీ సర్కారు ఉద్దానం గ్రామాల ప్రజల కోసం ఈ ప్రాజెక్టును పూర్తి చేసి చూపించింది. ఇదే ప్రాజెక్టుకు అనుసంధానంగా పాతపట్నం నియోజకవర్గంలోని 444 గ్రామాలకు తాగునీరు అందించేందుకు పథకం విస్తరణకు సైతం శ్రీకారం చుట్టింది. అప్పట్లోనే శంకుస్థాపన కూడా జరిగింది. సరిగ్గా అవే పనులకు కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం మళ్లీ శంకుస్థాపన చేయడం హాస్యాస్పదంగా మారింది.

భగీరథ ప్రయత్నం..

కిడ్నీ వ్యాధులతో బాధ పడుతున్న ఉద్దానం ప్రజల కోసం రూ.700 కోట్లతో ఉద్దానం సమగ్ర మంచినీటి పథకం నిర్మాణానికి వైఎస్ జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కరోనా కష్టకాలం ఎదురువచ్చినా అన్నింటినీ దాటుకుని ఉద్దానం వరకు వంశధారను తీసుకువచ్చింది. ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేందుకు భగీరథ ప్రయత్నమే చేసింది.

రూ.265 కోట్లతో పాతపట్నానికి..

హిరమండలం వద్ద ఉన్న వంశధార రిజర్వాయర్ నుంచి జలాలను తరలించి శుద్ధి చేసి నీటిని అందించాలన్నది ఈ పథకం లక్ష్యం. పాతపట్నంకు కూడా ఈ నీటిని అందించేందుకు అప్పటి ఎమ్మెల్యే రెడ్డి శాంతి వైఎస్ జగన్‌ను ఒప్పించారు. ఆమె అడిగిందే తడవుగా పథకం విస్తరణకు రూ.265 కోట్లు విడుదల చేశారు. దీంతో 2024 ఫిబ్రవరి 19న అప్పటి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు శంకుస్థాపన చేసి పనులు కూడా ప్రారంభించారు. ఇంతలో ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారిపోయింది. ఏడాదిగా ఈ పనుల ఊసేలేదు. కానీ ఇప్పుడు అవే పనులకు మళ్లీ శంకుస్థాపన చేయడం విమర్శలకు తావిస్తోంది.



ఉద్దానం తాగునీటి రెండో దశ పనులకు వైఎస్సార్‌సీపీ హయాంలో కాగువాద చంద్రయ్యపాలెం వద్ద శంకుస్థాపన చేసిన దృశ్యం (ఫైల్)



శంకుస్థాపన చేసిన పనులకు మళ్లీ శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గోవిందరావు

జెడ్పీ చైర్‌ను అవమానించారు..

'జిల్లా పరిషత్ నుంచే ఆర్‌డబ్ల్యూఎస్ పథకాలకు నిధులిస్తున్నాం. ఉద్దానం ప్రాజెక్టుకై తే జగనన్న ప్రభుత్వ హయాంలో రూ.700 కోట్లతో హిరమండలం నుంచి ఏకంగా ఉద్దాన ప్రాంతానికి ఇంటింటికీ తాగునీరు అందించాం. కానీ ఇప్పుడు అధికారులు నాకు కనీసం సమాచారం ఇవ్వకుండా కొత్తగా శంకుస్థాపనలు చేస్తున్నారు. ఇలా ప్రొటోకాల్ ఉల్లంఘించడం నన్ను అవమానించడం కాదు.. జెడ్పీ చైర్‌ను అవమానించడం.' అని జెడ్పీ చైర్ పర్సన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె ఇలా స్పందించారు. పాతపట్నం నియోజకవర్గానికి హిరమండలం నుంచి రూ.265 కోట్లతో మంచినీటిని అందించే పనులకు గతంలోనే శంకుస్థాపన చేయించామని, మళ్లీ ఇవే పనులకు ఇప్పుడేదో కొత్తగా చేస్తున్నట్లు మళ్లీ శంకుస్థాపనకు సిద్ధమయ్యారని విమర్శించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా తనకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమాచారం ఇవ్వకపోవడం ఏమాత్రం సరికాదన్నారు.



దీన్ని చిత్తశుద్ధి అంటారా?

ఇంత కంటే అన్యాయం ఉంటుందా? అది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టు. పాతపట్నం నియోజకవర్గం గురించి అడిగిన వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.265 కోట్ల జలజీవన్ మిషన్ నిధులు ఇచ్చారు. పనులు కూడా ప్రారంభమయ్యాయి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే నిలిపివేసింది. ఇప్పుడు ఏడాది తర్వాత మళ్లీ శంకుస్థాపన చేసింది. దీన్ని చిత్తశుద్ధి అంటారా? – రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే, పాతపట్నం

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


దొరబాబు (ఫైల్)

హిరమండలం: అప్పుల బాధ తట్టుకోలేక తంప గ్రామానికి చెందిన డోల దొరబాబు (35) ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను ధనుపురం గ్రామ సమీపంలో స్పైసీ దాబా నిర్వహించేవాడు. ఈ క్రమంలో ఐదేళ్ల కిందట వ్యాపారం కోసం అప్పులు చేశాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దొరబాబుకు భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. తండ్రి అప్పల నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహ్మద్ యాసిన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


చైతన్య(ఫైల్)

వజ్రపుకొత్తూరు : కొండవూరు గ్రామానికి చెందిన కొరికాన చైతన్య(29) అనే యువకుడు శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో పూండి నుంచి పలాస బైక్‌పై వెళుతుండగా బెండిగేటు సాయిబాబా గుడి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. చైతన్య సీమేన్‌గా పనిచేస్తున్నాడు. తమ్ముడు హరీష్‌తో కలసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. తల్లిదండ్రులు గున్నయ్య, అమ్మన్నలు ఏడేళ్ల క్రితమే చనిపోయారు. చైతన్యకు జూలై 31న వివాహం జరగాల్సి ఉంది. ఇంతలోనే మృతి చెందడంతో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఏఎస్ఐ రమణా రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాముకాటుకు చిన్నారి మృతి


గుడియా సాయిసా (ఫైల్)

కంచిలి: మకరాంపురం గ్రామానికి చెందిన గుడియా సాయిసా(10) అనే చిన్నారి పాము కాటుకు గురై మృతిచెందింది. వివరాల్లోకి వెళితే.. గుడియా పూర్ణ చంద్ర-గీత దంపతుల కుమార్తె సాయిసా కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటేసింది. చిన్నారిని కుటుంబ సభ్యులు వెంటనే సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బరంపురం ఎం.కె.సి.జి. ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందింది. సాయిసా స్థానిక ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. తండ్రి పూర్ణచంద్ర టిఫిన్ హోటల్‌లో హెల్పర్‌గా, తల్లి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. చిన్నారి సాయిసాతోపాటు కుమారుడు ఉన్నాడు. కుమార్తె మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు సిక్కోలు క్రీడాకారులు


ఎస్.రామ్మోహన్


పి.యమున

శ్రీకాకుళం న్యూకాలనీ: మొదటి జాతీయ స్థాయి జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్-2025 పోటీలకు జిల్లాకు చెందిన సత్తారు రామ్మోహనరావు (అక్కులపేట, ఆమదాలవలస మండలం), పోతనపల్లి యమున (పల్లిసారథి, పలాస మండలం) ఎంపికయ్యారు. ఈ పోటీలు జూన్ 29 నుంచి జూలై ఒకటో తేదీ వరకు ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ వేదికగా జరగనున్నాయి. ఇప్పటికే వీరు ఏపీ జట్లతో కలిసి హరిద్వార్ చేరుకున్నారు. వీరి ఎంపిక పట్ల జిల్లా కబడ్డీ సంఘం చైర్మన్, ఎమ్మెల్యే గొండు శంకర్, అధ్యక్షుడు నక్క రామకృష్ణ, కార్యదర్శి సాధు ముసలి నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సాధు శ్రీనివాసరావు, కోశాధికారి నాగళ్ల రమేష్, మెట్ట తిరుపతిరావు, కబడ్డీ సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ పోటీల్లోనూ సత్తాచాటి జిల్లాకు పతకంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. మెరుగైన ప్రదర్శన కనబరాలన్నారు.

అధికారులూ.. ఇదేం పద్ధతి!

- ప్రొటోకాల్ ఉల్లంఘనపై జెడ్పీ చైర్‌పర్సన్ విజయ మండిపాటు
- 15వ ఆర్థిక సంఘ నిధుల మళ్లింపుపై జెడ్పీటీసీల ఆగ్రహం
- టెక్కలిలో పారిశుద్ధ్య నిర్వహణ తీరుపై ధ్వజమెత్తిన దువ్వాడ వాణి
- వాడీవేడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం


ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ లలితపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

అరసవల్లి:

జిల్లా పరిషత్ నిధులతో నిర్మిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ పథకాల పనుల శంకుస్థాపన సమయంలో అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘించడంపై జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల తీరు తనకు మాత్రమే కాకుండా తన పదవి(చైర్)కే అవమానం జరిగినట్లు భావించాల్సి ఉంటుందని మండిపడ్డారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజాల ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై వాడీవేడిగా చర్చ జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా ఈ కీలక సమావేశానికి అధికార పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఇద్దరు మినహా మిగిలినవారెవ్వరూ హాజరుకాలేదు. ప్రజల సమస్యలపై జెడ్పీటీసీలు నిలదీస్తారేమో అనే ఇంటిలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలోనే మంత్రులు, విప్‌లు హాజరుకాలేదని సమాచారం.

- జిల్లాలో పంచాయతీలకు జమ కావాల్సిన 15వ ఆర్థిక సంఘ నిధులు ఎటుపోయాయని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, జెడ్పీటీసీలు టొంపల సీతారాం, నాగేశ్వరరావు, కాయల రమణ, బెండి గోవిందరావు, దువ్వాడ వాణి, వంగర ఎంపిపి సురేష్ ముఖర్జీ తదితరులు అధికారులను నిలదీశారు. దీనిపై జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా స్పందించి నిధులు పంచాయతీల ఖాతాలకు అడ్జస్ట్ అవుతాయని ప్రకటించారు. అనంతరం డీపీఓ భారతీ సౌజన్య పంచాయతీల ఆర్థిక నిధుల ఖాతాల్లో బాలెన్స్‌ల వివరాలను చదివి వినిపించారు.
- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ నాగావళి కుడి ఎడమ కాలువల ఆధునీకరణ పనుల సంగతేంటని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఈ పనులకు రెండు దఫాలుగా నిధులు కేటాయించినా ఈ ప్రభుత్వం ఎందుకు పనులు మొదలుపెట్టలేదని జలవనరుల శాఖాధికారులను ప్రశ్నించారు. జిల్లా పరిషత్ పాలకులకు ఇంకో ఏడాదిన్నర సమయం మాత్రమే ఉందని, ఇప్పటికైనా జెడ్పీటీసీలకు నిధులు కేటాయించి వారి హక్కులను కాపాడేలా పనులు చేయించాలని కోరారు.
- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ గార మండలంలో వత్సవలస, కళింగపట్నం, అంబళ్లవలస ఎత్తిపోతల పథకాల పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని అధికారులను ప్రశ్నించారు. దీనిపై జలవనరుల శాఖాధికారులు స్పందిస్తూ వచ్చే నెల 15న నీరు అందిస్తామని సమాధానమిచ్చారు.
- ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం శ్రీకాకుళం కార్పొరేషన్‌లో ఎచ్చెర్ల పరిధిలోని కుశాలపురం, తోటపాలెం గ్రామ పంచాయతీలను విలీనం చేసిందని..దీంతో అక్కడి గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, మళ్లీ ఈ రెండు గ్రామాలను పంచాయతీలుగా మార్చేలా గెజిట్ తెస్తామని ప్రకటించారు. జల్‌జీవన్ మిషన్, ఉపాధి హామీ పనులకు కూడా ఈ రెండు గ్రామాలు అర్హత కోల్పోయాయని, అక్కడి గ్రామస్తుల వినతిమేరకు ఈ గెజిట్ విడుదలకు చర్యలు చేపట్టాలని సీఎం దృష్టికి తీసుకెళ్లామని వివరించారు.


పూర్తిస్థాయిలో హాజరుకాని ఎమ్మెల్యేలు

ఆమరణ దీక్ష చేస్తా: టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి


ధర్నా చేస్తానని ప్రకటిస్తున్న టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి

టెక్కలి మండలంతో పాటు చాలా చోట్ల సర్పంచ్‌లు ఎలాంటి తప్పులు చేయకపోయినా అధికారులు చెక్‌పవర్ రద్దు చేస్తున్నారని..ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలిగిస్తున్నారని టెక్కలి జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగిపోవద్దని.. మళ్లీ జగనన్న ప్రభుత్వం వస్తుందని అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. టెక్కలి మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్యం, మౌలిక వసతుల నిర్వహణ తీరు దారుణంగా ఉందని, ఈ నిర్లక్ష్యం వీడేంతవరకు టెక్కలిలో ఆమరణ దీక్ష చేపడతానని ప్రకటించారు. పంచాయతీ, మండల పరిషత్ నిధులను ఆయా ప్రాంతాల అభివృద్ధికే వినియోగించాలన్నారు. టెక్కలిలో 196 హుదూద్ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు కల్పించాలని కోరారు.

సమాచారం ఇవ్వకపోవడం తగదు: జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

వివిధ శాఖల ప్రగతి నివేదికల సమీక్షలో భాగంగా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఇంజినీర్ లలితకుమారి మాట్లాడుతూ ఉద్దానం ప్రాజెక్టు విస్తరణ పనులను వివరించారు. ఇచ్ఛాపురం పట్టణానికి తాగునీటిని అందించే పనుల ప్రస్తావించగానే.. చైర్‌పర్సన్ విజయ ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన పనులకు మళ్లీ శంకుస్థాపన చేయడమేంటని ప్రశ్నించారు. చైర్‌పర్సన్‌గా ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన తనకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమాచారం ఇవ్వకపోవడం తగదన్నారు. కంచిలి మండలంలో తాగునీటి పథకాలకు విద్యుత్ కనెక్షన్ కట్ చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. డ్రోన్ల వినియోగంపై అక్కడి రైతులకు అవగాహన కల్పించాలని కోరారు.

మందస ఎంఈఓపై డీఈఓకు ఫిర్యాదు


డీఈఓతో మాట్లాడుతున్న యూటీఎఫ్ ప్రతినిధులు

మందస : ఉన్నత విద్యాశాఖ అధికారుల ఉత్తర్వులను మందస ఎంఈఓ-1 లక్ష్మణరావు పట్టించుకోకుండా మండలంలో ఒక్క ప్రాథమికోన్నత పాఠశాల కూడా లేకుండా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ చేశారని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ తప్పుపట్టారు. దీనిపై దర్యాప్తు చేపట్టి ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని డీఈఓ తిరుమల చైతన్యకు వినతిపత్రం అందజేసినట్లు శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు.

పలు ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల విద్యార్థులు నిబంధనల మేరకు ఉన్నప్పటికీ స్కూల్స్‌ను కుదించారని, ఇందులో ఎంఈఓ చేతివాటం ప్రదర్శించారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి ఆరోపించారు. నారాయణపురం పాఠశాలలో 6, 7, 8వ తరగతుల విద్యార్థులు 52 మంది, బుడారిసింగిలో 44 మంది, హోన్నాలిలో 44 మంది, పరియాపల్లిలో 37 మంది, సువర్ణాపురంలో 31 మంది, కొరాడాబడిలో 33 మంది ఉన్నా పాఠశాలలను డౌన్‌గ్రేడ్ చేయడం బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈఓ స్పందిస్తూ క్షేత్రస్థాయిలో పర్యటించి పాఠశాలల పునరుద్ధరణకు తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శి గున్న రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ జి.కోదండరావు,మండల ప్రధాన కార్యదర్శులు జగదీష్, దాసరి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా లింగ నిర్ధారణ చట్టం అమలు


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహిళా శిశు సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, లింగ నిర్ధారణ చట్టం అమలులో ఎలాంటి విడుపులూ లేకుండా కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష, మూఢనమ్మకాలపై ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నారు. లింగ నిర్ధారణ చేసి గర్భస్రావానికి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ నిర్వహించిన సర్వే ప్రకారం 2019-21లో 1000 మందికి పురుషులకు 1163 మంది స్త్రీలు ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ అనిత మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 16 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించామని, లింగ నిర్ధారణ జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా పేద ప్రజలకు సత్వరం వైద్య సేవలను అందించే విషయంలో నిర్లక్ష్యం పనికిరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐవీఆర్ఎస్ ద్వారా 387 కేసులలో అభిప్రాయం కోరగా 20 కేసులలో ప్రైవేట్ ఆసుపత్రులు డబ్బులు వసూలు చేశాయని ఫిర్యాదులు అందాయని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ కళ్యాణ్ బాబు, డీఐఓ రామ్‌దాస్, డిప్యూటీ డీఎంహెచ్ఓ మేరీ కాథరిన్, ఆర్‌బీఎస్‌కే కో-ఆర్డినేటర్ వెంకట్రావు, డీపీఎంవో బి.రవీంద్ర, ట్రైనింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.వి.లక్ష్మి, స్వర్ణలత, బెజ్జిపురం యూత్ క్లబ్ ప్రతినిధి ఎన్.ప్రసాదరావు, డిప్యూటీ డీఈఎంఓ వెంకటేశ్వరరావు, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ ప్రకాష్‌రావు, కిమ్స్ ఆస్పత్రి ఏవో సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ బదిలీల్లో సిఫార్సులకే పెద్దపీట!


కార్పొరేషన్ కార్యాలయం వద్ద వేచి ఉన్న ఉద్యోగులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

గ్రామీణ వ్యవసాయ సహాయకులు (వీఏఏ)ల బదిలీల ప్రక్రియ శనివారం జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించారు. పేరుకే వెబ్ కౌన్సెలింగ్ అయినా చేసేదంతా సిఫార్సు లేఖలకేనని విమర్శలు వినిపిస్తున్నాయి. సచివాలయ ఉద్యోగులకు బదిలీ జీవో ఇచ్చినప్పటి నుంచి ఎమ్మెల్యేలు, మంత్రులు పేషీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో ఎమ్మెల్యేలు ఓ జాబితా తయారుచేసి జిల్లా వ్యవసాయాధికారి చేతిలో పెట్టినట్లు సమాచారం. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో మొత్తం 557మంది వీఏఏలు ఉండగా వీరిలో 18 మంది వివిధ పరిస్థితులు దృష్ట్యా బదిలీల్లో ఎఫెక్ట్ కాకుండా ఉన్నారు. మిగిలిన వారికి నిబంధనలు, పారదర్శకంగా బదిలీలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నా వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రతి నియోజకవర్గంలో తమకు కావాల్సినవారికి ఎమ్మెల్యేలు, మంత్రులు ఇప్పటికే లేఖలు ఇచ్చి సిఫార్సులున్నవారికే నచ్చిన చోటకి బదిలీ చేస్తున్నారని పలువురు గగ్గోలు పెడుతున్నారు. మొదటి రోజు 150 మందికి కౌన్సిలింగ్‌కు పిలవగా.. మిగిలినవారికి ఆది, సోమవారాల్లో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిసింది.

మున్సిపాలిటీల్లో 300 మందికి పైగా బదిలీ..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ కలిపి శ్రీకాకుళం కార్పొరేషన్, ఆమదాలవలస, రాజాం, పాలకొండ, పలాస, ఇచ్ఛాపురం కమిషనర్ల ఆధ్వర్యంలో పనిచేస్తున్న వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీలు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీలకు సైతం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. వార్డు ఎమినిటి సెక్రటరీలకు మాత్రం పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఆఫీస్ విశాఖపట్నం నుంచి అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. అన్ని విభాగాల్లో కలిసి సుమారు 300 మందికి పైగా బదిలీ చేసినట్లు కమిషనర్ తెలిపారు. అధిక సంఖ్యలో సిఫార్సు లేఖలకే ప్రాధాన్యమిచ్చినట్లు తెలుస్తోంది.

బాక్సింగ్‌లో మెరిసిన సత్య భార్గవ్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన జి.సత్య భార్గవ్ బాక్సింగ్‌లో మెరిశాడు. ఇటీవల హర్యానాలో జరిగిన 6వ జూనియర్ నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ - 2025 పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. ఈ పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎస్.దేవివరప్రసాద్ త్రుటిలో పతకం కోల్పోయాడు. టోర్నీ ముగించుకుని జిల్లాకు తిరిగొచ్చిన క్రీడాకారులను, డీఎస్ఏ కోచ్ ఎం.ఉమామహేశ్వరరావును డీఎస్‌డీఓ డాక్టర్ కై.శ్రీధర్ గవరావు శనివారం అభినందించారు. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీఏ లక్ష్మణ్ దేవ్, బలగ సీతారాం, వంగా మహేష్, సీనియర్ బాక్సర్లు హర్షం వ్యక్తం చేశారు.


క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీఓ శ్రీధర్, కోచ్ ఉమామహేష్

బైక్‌ను ఢీకొట్టిన కారు


ఘటనా స్థలంలో ఉన్న ద్విచక్ర వాహనం, కారు


తీవ్రగాయాలపాలైన దుర్యోధన జెన్నా

- ఒకే కుటుంబంలో ముగ్గురికి గాయాలు

కంచిలి: కంచిలిలో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. బొగాబెణి పంచాయతీ జెన్నాగాయి గ్రామానికి చెందిన దుర్యోధన జెన్నా భార్య తులసి జెన్నా, మూడేళ్ల కుమారుడు ఢిల్లేశ్ జెన్నాలతో కలిసి బైక్‌పై కంచిలి బజారుకు బయలుదేరాడు. అదే సమయంలో పలాస వైపు నుంచి ఇచ్ఛాపురం వైపు వెళుతున్న కారు అతివేగంతో వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన కాలువలోకి ద్విచక్ర వాహనంతో సహా సుమారు వంద మీటర్లు ఈడ్చుకెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న భర్త, భార్య, బిడ్డలు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిని 108 అంబులెన్స్‌లో సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కారు కవిటి మండలం ఇంటినకపుట్టుగ గ్రామానికి చెందినదిగా స్థానికులు చెబుతున్నారు. కారును నిర్లక్ష్యంగా నడపటం వల్లే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. గాయపడిన దుర్యోధన జెన్నా గొల్లకంచిలి గ్రామంలో నిమ్మాసినమ్మ ఆలయ పూజారిగా పనిచేస్తున్నారు. పూజా సామగ్రి కొనుగోలుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కంచిలి ఏఎస్ఐ పి.అప్పిరెడ్డి కేసు నమోదు చేశారు.

శ్రీముఖలింగంలో ఇకపై ఆన్‌లైన్ టికెట్లు

జలుమూరు: శ్రీముఖలింగంలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇక నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయించనున్నట్లు దేవస్థాన ఇన్‌స్పెక్టర్ డి.ప్రసాదబాబు తెలిపారు. ఆయన శనివారం శ్రీముఖలింగం కార్యాలయంలో ఈఓ పి.ప్రభాకరరావుతోపాటు ఫిర్యాదుదారుడు నాయుడుగారి రాజశేఖర్‌ను కలిసి విచారించి అనంతరం పలు అంశాలను వివరించారు. శ్రీముఖలింగంలో అన్నదానం పేరిట భక్తులు నుంచి విరాళాలు సేకరిస్తున్నారని గ్రామానికి చెందిన ఎస్.రాజశేఖర్ ఇటీవల స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఈ నేపథ్యంలో దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తి వివరాలు సేకరించి కలెక్టర్‌కు నివేదించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. శ్రీముఖలింగంలో ఎలాంటి అన్నదానం నిర్వహించడం లేదని, భక్తులు ఇతర సేవలకు విరాళాలు అందిస్తే వాటికి తగు రశీదులు కార్యనిర్వాహక అధికారి నుంచి పొందాలని ఆయన సూచించారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం


కోటపాలెం పంచాయతీ కేంద్రం వద్ద డీపీవో భారతి సౌజన్య

రణస్థలం: జిల్లా వ్యాప్తంగా అనిన్న గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పంచాయతీరాజ్ అధికారి కె.భారతి సౌజన్య అన్నారు. రణస్థలం మండలం కోటపాలెం పంచాయతీని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రం ద్వారా స్వచ్ఛ పంచాయతీ సాధనకు సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పంచాయతీ ప్రజలకు తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు. ఐ.వి.ఆర్.ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా చెత్త బండికి సంబంధించిన అభిప్రాయ సేకరణ వస్తే సరైన సమాధానం చెప్పాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ వి.ప్రకాష్‌రావు, డీపీఆర్ఎస్ కో ఆర్డినేటర్ కె.నిశ్చల, మాజీ సర్పంచ్ సుంకరి ధనుంజయరావు, పంచాయతీ కార్యదర్శి ఆర్.శ్రీధర్, నాయకులు జోగ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు ప్రశంసలు


ప్రశంసాపత్రంతో ఒకటో పట్టణ సీఐ పైడపునాయుడు


ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న సీసీఎస్ సీఐ చంద్రమౌళి

శ్రీకాకుళం క్రైమ్ : ప్రాపర్టీ కేసుల ఛేదన, రికవరీ, ముద్దాయిల అరెస్టు, పనితీరు పాటు మరికొన్ని ముఖ్య కేసులను ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి శనివారం ప్రశంసించారు. గత ఆరు నెలల్లో 84 ప్రాపర్టీ, గ్రేవ్ కేసులు, రెండు నెలల్లో 20 కేసుల్లో ప్రతిభ కనబర్చిన సీఐ సూర్యచంద్రమౌళి సారథ్యంలోని సీసీఎస్ పోలీసు బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఇటీవల ఛేదించిన కేసులివే..

మందస, సారవకోటలో బ్యాంకులకు వెళ్లిన ఇద్దరు వేర్వేరు వ్యక్తులు అమౌంట్ తీసుకుని వచ్చి కారు డిక్కీలో పెట్టడాన్ని చూసిన ఒడిశాకు చెందిన దున్న మనోజ్ వారిని దృష్టి మరల్చి ఓ చోట రూ.1.50 లక్షలు, మరో చోట రూ. 90 వేలు దొంగిలించాడు. కాశీబుగ్గలో 40 తులాల బంగారం, శ్రీకాకుళంలోని ఏసీబీ సీఐ హరి నివాస గృహంలో ఏడున్నర తులాల బంగారం కేసులతో పాటు మరో 14 కేసుల్లో ముద్దాయిలైన ముద్దాడ నర్సింగరావు (ఎచ్చెర్ల మండలం), పార్వతీపురం మన్యం జిల్లావాసిని పట్టుకోవడంలో కృషి చేశారు. ఉమెన్స్ కళాశాల ఆవరణలో విద్యార్థినిపై జరిగిన దాడి కేసు ఛేదనలో సీసీఎస్ సీఐ చంద్రమౌళితో పాటు శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ పైడపునాయుడుకు ప్రశంసాపత్రం దక్కింది. వీరితో పాటు పాతపట్నం సీఐ రామారావు, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు హరికృష్ణ, రాము, మధుసూదన్, గఫూర్, హెచ్‌సీ జగదాంబ, పోలీస్ కానిస్టేబుళ్లు ఉన్నారు.